సెల్ టవర్ పనులు నిలిపివేయాలంటూ ధర్నా

విశాలాంధ్ర-పాయకరావుపేట: సెల్ టవర్ పనులు నిలిపివేయాలంటూ పట్టణంలోని మంగవరం జంక్షన్ సమీపంలో ఆ ప్రాంత వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజలు నివసించే ప్రదేశంలో ఒక భవనం మేడ మీద సెల్ టవర్ నిర్మిస్తున్నారని తెలిపారు. సెల్ టవర్ వలన రేడియేషన్ పెరిగి ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని వాపోయారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, పలు వ్యాధులు బారిన పడినవారు నివాసం ఉంటున్న ప్రదేశంలో సెల్ టవర్ నిర్మాణం ప్రజల అనారోగ్యానికి దారితీస్తుందని వాపోయారు. సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఆ ప్రాంతవాసులు పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జగతా నాగరాజు, జగతా శ్రీనివాస గంగాధర్, జగతా అమ్మిరాజు, ఉప్పాల అప్పలస్వామి, పత్రి సత్యేంద్ర కుమార్, పత్రి శరత్ కుమార్, కర్రి శీను, చిట్టూరి లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం నిర్దేశించుకుని కష్టపడితే విజయం తథ్యం

కలెక్టరు విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా చేసుకొని చదవాలని కలెక్టరు విజయ క్రిష్ణన్ తెలిపారు. డి ఎస్ సి ఉద్యోగ నియామక పరీక్షకు హాజరయ్యే వెనుక బడిన తరగతులు(బి.సి), షెడ్యూల్ కులాలు (ఎస్.సి.), షెడ్యుల్ తెగలు(ఎస్.టి.) ఈ.బి.సి కులాలకు చెందిన అభ్యర్థులకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గౌరీ గ్రంధాలయంలో ఏర్పాటుచేసిన మెగా డిఎస్సి ఉచిత శిక్షణ శిభిరాన్ని శనివారం ఉదయం జిల్లా కలెక్టరు విజయక్రిష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని కష్టపడి చదివితే ఫలితాలు సాదించ వచ్చునని తెలిపారు. లక్ష్యం నుండి దృష్టి మరల్చకూడదన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ యుగంలో దానిని మన అవసరాలకు మాత్రమే ఉపయోగించు కోవాలని, సోషల్ మీడియాకు బానిస కాకూడదన్నారు. విద్యకు, ఉపాధి కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ద్వారా ప్రోత్సాహం అందిస్తున్నదని, దానిలో భాగంగా ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డి ఎస్ సి ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. బెట్లో మెరిట్ ప్రాతిపాదికన రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసి, శిక్షణా కేంద్రంలో 220 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తామన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదుతో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో 75 శాతం హాజరు నమోదు ఉన్న అభ్యర్థులకు నెలకు పదిహేను వందల రూపాయలు స్టైపెండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం వేయి రూపాయలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. పురుషులతో పాటు సమానంగా స్త్రీలు కూడా పోటీపడాలని, విజయం సాధించుట ద్వారా మహిళలు ఆర్థిక స్వాతంత్ర్యం పొందాలని తెలిపారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న స్త్రీకి సంఘంలో గౌరవం పెరుగుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు నిపుణుల సూచనలు. ప్రణాళికలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా సబ్జెక్టు పరిజ్ఞానం, వర్తమాన అంశాలపై అవగాహన పెంచు కోవాలన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే చదివిన సబ్జెక్టుపై పట్టు పెంచుకోవడం ముఖ్యమన్నారు. ప్రతి పాఠ్యాంశంలోని ముఖ్యంశాలనూ నోటు పుస్తకంలో రాసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన తర్వాత, పరీక్ష రాసేనాటికి వ్యవధి చాలా తక్కువగా ఉంటుందని, పోటీ పరీక్షలకు సమయ నిర్వహణ ముఖ్యమని, టైమ్ టేబుల్ వేసుకుని ప్రతి సబ్జెక్టుకూ, చాప్టరుకూ నిర్ణీత సమయాన్ని కేటాయించుకోవాలన్నారు. వ్యక్తిగత క్రమశిక్షణ, అంకితభావం ఎంతో అవసరమన్నారు. మాక్ టెస్టు రాయడం ద్వారా పనితీరును ఎప్పటికప్పుడు విశ్లేషించుకుని అందుకు అనుగుణంగా ప్రణాళికలో మార్పులూ, చేర్పులూ చేసుకోవాలన్నారు. ప్రిపరేషన్ సమయంలో కొంతమంది విద్యార్థులు విపరీతమైన ఆందోళన, ఒత్తిళ్లకు గురవుతుంటారు. ఇలాంటప్పుడు మధ్యలో కాస్త విరామం తీసుకోవాలి. యోగా, ధ్యానం, వ్యాయామాలు చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించి ఉపశమనం పొందవచ్చునన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకొని డి ఎస్ సిలో విజయం సాధించాలని కలక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. సమావేశం అనంతరం ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంటు ప్రొఫెసర్ ఎ.అర్జున అప్పారావు రూపొందించిన ఏకలవ్య కరెంటు ఎఫైర్స్ పుస్తకాన్ని జిల్లా కలెక్టరు ఆవిష్కరించారు. కార్యక్రమం లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణ, మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరక్టర్ కె.రాజేశ్వరి, జిల్లా విద్యాశాఖాధికారి జి. అప్పారావు నాయుడు, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జోగారావు, శ్రీ గౌరీ లైబ్రరీ సంఘం అధ్యక్షులు కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఐటియుసి

విశాలాంధ్ర-అనకాపల్లి: ఆటో మోటార్ కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటియుసి గౌరవాధ్యక్షులు వైఎస్ భద్రం మాట్లాడుతూ ఆటో కార్మికుల బతుకులు దినదిన గండం దీర్ఘాయుష్ లా ఉన్నాయని డీసీల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగి ఆటోలు మోటార్ వాహనాలు నడపలేని పరిస్థితుల్లో దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. బియ్యం పప్పులు వంట నూనెలు, కూరగాయలు ధరలు విపరీతంగా పెరిగి ఏమీ కొనలేక తినలేక అప్పులు ఊబిలో కోరుకొని సతమతమవుతున్నారు అన్నారు. రోడ్లు గుంతలపడి శిధిలావస్థకు చేరాయని తరచూ తమ వాహనాలు మరమ్మత్తులకు గురవుతుంటే దారికాసిఆర్టీవో అధికారులు, పోలీసులు ఈ చలాన్ పేరుతో కేసులు నమోదు చేసి ఈ కార్మికుల బతుకులు ని చిద్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం వాహన మిత్ర పథకం కింద పదివేల రూపాయలు అందించేదని చంద్రబాబు కూటమి ప్రభుత్వం తమ అధికారంలోకి వస్తే ఆటో కార్మికుల సంక్షేమ కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చి వాహన మిత్రును కూడ ఎనిమిది నెలలుగా వస్తున్న అందజేయడం లేదని విమర్శించారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు తో పాటు, డీజిల్, పెట్రోల్ వంట గ్యాస్ ధరలు తగ్గించాలని, ఆటో డ్రైవర్లకు హాని చేసే జీవో నెంబర్ 21, 31 లను రద్దు చేయాలని, పెండింగ్ లో ఉన్న ఈ చలానా రద్దుచేసి కేసులు ఎత్తివేయాలని,పాడైన, శిథిలావస్థకు చేరిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని, భారీగా పెంచిన రోడ్డు టాక్సను, ఎఫ్ సి పన్నులను తగ్గించాలని, నిత్యవసర వస్తువులధరలు తగ్గించాలని, మరణించిన ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వ ఆదుకోవాలని ఆర్డీఓ ఏవో గారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కే త్రినాధ, కోరుబిల్లి శంకర్రావు, కొలుసురాంబాబు, ఎం దేవుళ్ళు, ఎస్ రమణ, కే రాజు, పి అప్పలనాయుడు, పెదిరెడ్ల నాగేశ్వరరావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

తహసీల్దార్ లక్ష్మీ

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలో రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ లక్ష్మీ సూచించారు. శనివారం మండలంలోని ఎల్బిపి అగ్రహారం గ్రామంలో తహసీల్దార్ లక్ష్మీ ఆధ్వర్యంలో రీ సర్వే రెవెన్యూ సదస్సు గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో లో రీ సర్వే లో జరిగిన పొరపాట్లను సంవరించడానికే ఈ రీ సర్వే, ఇతర భూ సమస్యలు పరిష్కరానికి రెవెన్యూ సదస్సు గ్రామసభ లను ప్రభుత్వం నిర్వహిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు అందరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమరాన దాసు, ఎంపీటీసీ యల్లపు జగ్గారావు, రెవిన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత ఉండాలి : డుమా పిడి

విశాలాంధ్ర-కే కోటపాడు: ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్ పూర్ణిమాదేవి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శాఖల వారీగా మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగ కార్యక్రమంలో ప్రారంభించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా సిసి రోడ్లను గోకులం షెడ్లను సంక్రాంతి కన్నా ముందుగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు అత్యధిక రోజులు పని కల్పించాలన్నారు. ప్రతి కూలి 100 రోజులు పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ ఏపీవోను ఆదేశించారు. సచివాల య కార్యదర్శులతో మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీగా ప్రతీ కార్యదర్శి ఉండాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం త్రాగునీరు విద్యుత్తు లైట్లు ఏర్పాటు తదితర వాటిని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. అనంతరం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు మండల పరిషత్ ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని చేపట్టి ఆవరణను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు ఈవోపీఆర్డి రమణి మండల ఇంజనీర్ సుమతి ఎంఈఓ 1, 2 కే సత్యనారాయణ ప్రసాద్ ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో అప్పలరాజు పాల్గొన్నారు.

విఎస్ఆర్ సేవా సంస్థ కు స్ఫూర్తి ఇంటర్నేషనల్ డాక్టరేట్ ప్రదానం



విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: మండలంలో పొట్టి దొరపాలెంకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ వడ్డి సత్యారావుకు డాక్టరేట్ లభించింది. హైదరాబాద్లో జరిగిన ఓ కార్యక్రమంలో స్ఫూర్తి ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు సత్యారావుకు డాక్టరేట్ బహుకరించారు.గత కొన్నేళ్లుగా సత్యారావు విఎస్ఆర్ సేవా సంస్థ ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. రోడ్డు పక్కన నిరాశ్రయులకు ఆహారం అందిస్తున్నారు. సత్యారావు సేవలను గుర్తించిన స్ఫూర్తి ఇంటర్నేషనల్ సంస్థ డాక్టరేట్ బహుకరించింది.ఈ సందర్భంగా సత్యారావును పలువురు పెద్దలు అభినందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



విశాలాంధ్ర-మాకవరపాలెం: అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సీతామాలక్ష్మి సూచించారు. ఈ మేరకు మాకవరపాలెం మండలంలో సెట్టిపాలెం రామన్నపాలెం పంచాయతీలలో ఉపాధి హామీ నిధులతో జరుగుతున్న కాలువలు రోడ్ల నిర్మాణం పనులను శనివారం ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టులకు సూచించారు ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

ప్రమాదాలపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలి

కమాండర్ సత్యనారాయణ

విశాలాంధ్ర-పరవాడ: పరిశ్రమలలో ప్రమాదాలను నివారించడానికి అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ఎదుర్కోవడానికి కార్మికులు అవగాహన కలిగి ఉండాలని జాతీయ విపత్తు స్పందన దళం 10వ బెటాలియన్ టీం కమాండరు వై. సత్యనారాయణ తెలిపారు. శనివారం పరవాడలోగల ఇండియన్ ఆయిల్ కార్పొరేషను సువెన్ ఫార్మా కర్మాగారాలలో సిబ్బందికి, కార్మికు లకు ప్రమాదాల సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు, తక్షణ చర్యలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా భద్రతా ప్రమాణాలు పాటించడం కార్మికుల మొదటి కర్తవ్యంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో పీపీఈ (Personal Protective Equipment) ఉపయోగం, ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, పని ప్రాంతం పరిశుభ్రత నిర్వహణ, ప్రమాదసూత్రాలను గుర్తించడం, నియమాలు మరియు ప్రోటోకాళ్లకు అనుగుణంగా పనిచేయడం, నియంత్రణ పద్ధతులు, ఫైర్ డ్రిల్స్ నిర్వహించడం, ప్రథమ చికిత్స గురించి అవగాహన తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అభివృద్ధి చేస్తే పర్యావరణ సుస్థిర అభివృద్ధి

విశాలాంధ్ర-పాయకరావుపేట : వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అభివృద్ధి చేస్తే పర్యావరణ సుస్థిర అభివృద్ధి జరుగుతుందని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ డైరెక్టర్ (రిటైర్డ్) డాక్టర్ వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్ అన్నారు. స్పేసెస్ డిగ్రీ కళాశాల జరిగిన పర్యావరణ సమస్యలు, సుస్థిర అభివృద్ధి అనే అంశం పై నిర్వహించిన సెమినార్ లో పాల్గొని ప్రసంగించారు. సుస్థిర అభివృద్ధి సాధించాలంటే ఆర్థిక, సామాజిక, మానవ అభివృద్ధితో పాటు పర్యావరణ అభివృద్ధి కూడా జరిగితేనే సమగ్ర అభివృద్ధిగా భావించాలని తెలిపారు. దీనికోసం వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే ప్రక్రియ అభివృద్ధి చేసినట్లయితే కొంతవరకు వ్యర్థాలను తగ్గించవచ్చని, ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన ఇంధన వనరు శిలాజ ఇంధనాల నుంచి ఇంధనం వేరు చేసే ప్రక్రియలో కాలుష్యం ఎక్కువగా ఉత్పత్తి అవుతుందని తెలిపారు. శిలాజ ఇంధనాన్ని వాడుకుండే క్రమంలో కూడా ఎక్కువగా కాలుష్యం ఉత్పత్తి అవుతుందన్నారు. కాలుష్యాన్ని తగ్గించాలి అంటే శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధనము అయిన సౌరశక్తి, పవన శక్తి, హైడ్రోజన్, ఇంధనశక్తిని ఉపయోగిం చాలని తెలిపారు. అమెరికా, చైనా, బ్రెజిల్ ప్రపంచంలో ఎక్కువగా ఘన వ్యర్థ పదార్థాలను ఉత్పత్తి చేసే దేశాలని, ప్రకృతి ప్రసాదించిన పర్యావరణంలో వ్యర్థం అనేది ఏదీ లేదని, ప్రతీ వ్యర్థంతోనూ సంపదగా మార్చే ఆలోచన మనిషి పెంపొందించుకొన్నప్పుడే పర్యావరణ సుస్థిర అభివృద్ధి సాధించగలమని తెలిపారు. వ్యర్థాల నిర్వహణ పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి యువత ముందుకు రావాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను నిరోధించవలసిన బాధ్యత కూడా యువత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కంటిపూడి నరేంద్రబాబు, శాస్త్రవేత్త ఎల్. నగేష్, సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ప్రిన్సిపల్ ఎ. రామకృష్ణా రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

- గ్రామస్తుల హర్షం

- మండల టిడిపి అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-మునగపాక: ఏళ్ల నాటి రోడ్డు సమస్యకు కూటమి ప్రభుత్వంలో కదలిక ఏర్పడడంపై గవర్ల అనకాపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతకుల రోడ్డుతో నానా అవస్థలు పడుతున్న ప్రజలకు శాశ్వత పరిష్కారం లభించడం సంతోషకరమని మండల టీడీపి అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు తెలిపారు. యలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్కుమార్ ఆదేశాలతో మండల తెదేపా అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో శనివారం గ్రామంలో దిగువ రామాలయం నుంచి సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేకు గ్రామం తరపున కృతజ్ఞతలు తెలిపారు. వందలాది కుటుంబాలు నివాసముంటున్న మార్గంలో సరైన రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడేవారని,గ్రామస్తుల విజ్ఞప్తి, కూటమి నేతల సహకారంతో పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ అధికారులు, పంచాయతీ సెక్రటరీ సిహెచ్ శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, నేతలు చదరం భాస్కరరావు, పొలమరశెట్టి మురళి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

విశాలాంధ్ర-నక్కపల్లి: మండలంలో జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం పాయకరావు పేట ప్రెస్ క్లబ్ నందు ఏ పి యు డబల్యు జే ఆధ్వర్యంలో నక్కపల్లి 50 పడకల ఆసుపత్రి వద్ద వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డా.శిరీష సీనియర్ పాత్రికేయులు డి.రాంబాబు, డి మురళీకృష్ణ ఎన్వి రమణ, పులిగి పెంటయ్య, కె వెంకటేష్ పాల్గొన్నారు.

పేకాట శిబిరం పై పోలీసులు దాడులు

విశాలాంధ్ర-యస్.రాయవరం : మండల కేంద్రం ఎస్ రాయవరం గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్న సిబ్బంది పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్సై ఏ. విభీషణరావు అందించిన వివరాలు ప్రకారం తమకు వచ్చిన సమాచారంతో తనిఖీలు చేయగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్నట్లు తెలిపారు. అలాగే వారి నుండి 9వేల40 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

మాడుగులలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం

విశాలాంధ్ర-మాడుగుల: మాడుగుల ప్రభుత్వ కళాశాల మైదానంలో శనివారం ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలసి కళాశాల మైదానంలో ఉన్న తుప్పలను, డొంకలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రతి శనివారం నిర్వహిస్తుందని సర్పంచ్ కళావతి అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బి.నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి బి.నవీన్, నూతన్, అప్పలరాజు, ఏఎన్ఎం సుగుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి

విశాలాంధ్ర-పాయకరావుపేట: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకా రులు అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పద్య పఠనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇసరపు పార్వతి, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, జెడ్పిటిసి లంక సూర్యనారాయణ, జగతా శ్రీను, వైఎస్ఆర్సిపి పట్టణ అధ్యక్షులు ధనిశెట్టి మహేష్, ధనిశెట్టి బుజ్జి, కేసనకుర్తి సత్తిబాబు, ధనిశెట్టి తులసీరామ్, ఇంచార్జి గ్రంథాలయ అధికారి వామాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

యువత దేశ అభివృద్ధికి, ఐక్యమత్యాన్ని పాటుపడాలి

కలెక్టరు విజయ కృష్ణన్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: యువజన ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా యువత తమ ప్రతిభను ప్రదర్శించి, గుర్తింపు పొందవచ్చునని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్రం (ఎన్వైకే) ఆధ్వర్యంలో స్థానిక శ్రీ గౌరీ గ్రంథాలయంలో 'యువ ఉత్సవ్%-%2024' వేడుకలను శనివారం ఉదయం జిల్లా కలెక్టరు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ. యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన, సృజనాత్మకత, సామూహిక చైతన్యాన్ని, దేశ భక్తిని పెంపొందించుటకు యువజన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నిర్వహించే పోటీలలో యువత మంచి ప్రదర్శన కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయి వేదికలలో అనకాపల్లి జిల్లాకు గుర్తింపు, పేరు తీసుకురావాలని ఆకాక్షించారు. కార్యక్రమం ద్వారా యువత వారి సాంప్రదాయ కళలు, నృత్యాలు, సంగీతం, నాటకాలు వంటి అంశాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం జరుగుతుందని, ఉత్సవాల్లో పాల్గొనడం ద్వారా యువత నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత ఒకే వేదికపై కలవడం ద్వారా వారికి సామాజిక సమగ్రత, ఇతరుల సంస్కృతులపై గౌరవభావం కలుగుతుందని, టెక్నాలజీ ప్రదర్శనలు, స్టార్టప్ ఐడియాలు భాగస్వామ్యంగా ఉండడం ద్వారా యువత తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించవచ్చునని, వారి ఆలోచనలను ఇతరులతో పంచుకొనుటకు వేదికగా ఉపయోగించుకోవాలని తెలిపారు. యువత భారతదేశ అభివృద్ధికి, ఐకమత్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి జి.మహేశ్వరావు మాట్లాడుతూ .అభివృద్ధి చెందిన భారతదేశ లక్ష్యం, బానిసత్వం వలసవాద మనస్తత్వాలను తొలగించడం, వారసత్వం, ఐక్యత, సంఘీభావం, పౌరులలో కర్తవ్య భావం (పంచ-ప్రమాణాలు) ప్రధాన అంశాలుగా యువశక్తి పెంపుదలలో భాగంగా జిల్లా స్థాయిలో సైన్స్ మేళా (వ్యక్తిగతం, గ్రూపు), యువ రచయితల పద్యాలు, పెయింటింగ్, ఫోటోగ్రఫీ, డిక్లమేషన్, సాంస్కృతిక, సంప్రదాయక ప్రదర్శనల పోటీలు నిర్వహించడం జరిగిందని, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ కె.తామస్ రవికుమార్, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఎన్వైకే రాష్ట్ర సలహా కమిటీ మాజీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ ఎం.జోగారావు, వివిధ పాఠశాలల విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

జిల్లా స్థాయీ పద్యపఠనం పోటీలలో పెదబోదుగల్లం హైస్కూలు విద్యార్థినికి ప్రథమస్థానం



విశాలాంధ్ర-నక్కపల్లి : ఈనెల 14 న బాలలదినోత్సవాన్ని పురస్కరించుకుని పి.ఆర్.టి.యు. వారి ఆధ్వర్యంలో నర్సీపట్నం కేంద్రంగా నిర్వహించిన జిల్లాస్థాయి బాలల విజ్ఞాన ప్రతిభా పోటీలలో సీనియర్స్ విభాగంలో పద్యపఠనం పోటీలలో మండలంలో పెదబోదుగల్లం హైస్కూల్ లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థిని జెరీనా కౌసర్ ప్రథమస్థానం సాధించినట్లు తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు తెలిపారు.ఈనెల 14న సాయంత్రం నర్సీపట్నంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో స్థానిక మండల విద్యాశాఖాధికారులు, జిల్లా పిఆర్టియు అధ్యక్షులు డి.గోపీనాథ్ చేతులమీదుగా జ్ఞాపిక ను, ప్రశంసాపత్రమును అందజేశారని ఆచార్యులు తెలియజేశారు. ఈ సందర్భంగా శనివారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చోడిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు.జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ఆయన ప్రత్యేకంగా అభినందించి మరికొంతమంది చిన్నారులు స్ఫూర్తి పొందాలన్నారు. ఇది పాఠశాల కు గర్వకారణమన్నారు.గత కొంత కాలంగా పద్యపఠనంలో శిక్షణ అందించి విద్యార్థుల ను పోటీలకు తయారుచేసిన తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులును ఆయన అభినందించారు. విజేత గా నిలిచిన జెరీనా కౌసర్ ను గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం, పాఠశాల కమిటీ చైర్మన్ మరియు ఉపాధ్యాయులు ఎస్.ఫాల్గుణ రావు, కుమారి, చిన్నారావు, శ్రీదేవి,రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర-కోటవురట్ల: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు, శ్రీ విద్వాన్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి అప్పలనా యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరిచిన ఎడల వారు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఉన్న విలువైన పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వర్ కిషోర్, రాజేశ్వరి, లిథియా తదితరులు పాల్గొన్నారు.

108 ఉద్యోగులు సమస్యలు వెంటనే పరిష్కరించాలి

విశాలాంధ్ర-కశింకోట: ఆపదల్లో ఉన్న ప్రజల ప్రాణాలు కాపా డేందుకు నిరంతరం శ్రమించే తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 25వ తేదీ నుంచి 108 సేవలు నిలుపుదల చేస్తామని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పైలెట్ అప్పికొండ రామకృష్ణ, అర్.శివ, ఈ.ఎం.టీ ఎస్.చంద్ర మౌళి లు శనివారం స్థానిక తహసిల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. వినతిలో 108 ఉద్యోగులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి పలుదఫాలుగా వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో ఈనెల25వ తేదీ నుంచి 108 సేవలను బంద్ చేస్తామని చెప్పారు.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను గెలిపించుకోవాలి

విశాలాంధ్ర-పాయకరావుపేట : ముతా కాలువ సాగునీటి సంఘం ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ముతా కాలువ పరిధిలోని రైతులతో, కూటమి పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిట్టిబాబు తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులు గ్రామాలలో చర్చించుకుని సంఘం సభ్యులను ఎంపిక చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు గెద్దం బుజ్జి, తోట నగేష్, గొర్రెల రాజబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీ విశ్వనాథ్, మజ్జూరి నారాయణరావు, నీలాపు మహేష్ రెడ్డి, గారా కృష్ణప్రసాద్, చించలపు ప్రదీప్, చించలపు వెంకటకృష్ణ, గెద్దం చైతన్య, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సమాజం బాగుండాలంటే బడి, గుడి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

ఎంపీడీవో ఆంజనేయులు

విశాలాంధ్ర-చోడవరం: ఆరోగ్యకరమైన సమాజం కోసం బడి, గుడి, పరిస రాలు పరిశుభ్రంగా ఉండాల ని చోడవరం ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆదేశాలతో కె. కాలనీ ఎంపీ యూపీ స్కూలు పాఠశాల ఆవరణ తో బాటు పలు చోట్ల శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. పాఠశాలలో జంగిల్ క్లియరెన్స్తో విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధతో కార్యక్రమం నిర్వహించామన్నారు. జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమంలో భాగంగా కె.కాలనీ పాఠశాల, ఇందిరా గాంధీ పార్కు వద్ద కాలువల వెంబడి శుభ్రం చేశారు. దీని వల్ల దోమలు వృద్ధి తగ్గి విధ్యార్థులు, ప్రజలు ఆరోగ్యంగా ఉంటార ఉంటారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కె. కాలనీ స్కూల్ హెచ్.ఎం. గొర్లి శ్రీనివాసరావు, ఈ.ఓ.ఆర్.డి. ఓ.మహేష్, ఈవో నారాయణరావు, ఏ.పి. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు, గోవాడ సుగర్స్ మాజీ చైర్మన్ గూనూరు మల్లు నాయుడు, మాజీ ఎంపీపీ గూనూరు పెదబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ నేమాలహరి, టౌన్ పార్టీ ప్రెసి డెంట్ దేవరపల్లి వెంకటప్పారావు, ఎంపీటీసీ పాలేం నాయుడు, వార్డ్ మెంబర్లు విస్సు, పంచాయతి సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయుల ర్యాలీ



విశాలాంధ్ర-ఎలమంచిలి: జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం ఎలమంచిలి పట్టణంలో పాత్రికేయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలమంచిలి ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాసిల్దార్ కార్యాల యం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ పాత్రికేయులు విలేకరుల ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఆదారి గంగాధర్, అయ్యప్పమూర్తి, ప్రసాద్, చిట్టిబాబు, నగిరెడ్డి సత్యనారాయణ, పిల్లా శివ, చిన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

జనవాని కార్యక్రమానికి విశేష స్పందన

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: పట్టణంలోని ఆర్. కె గ్రాండ్ వద్ద జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల యొక్క సమస్యల పరిష్కారానికై జనసేన పార్టీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించిందని పెన్షన్లు, ఇంటి స్థలాలు ఇతర సమస్యలపై అర్జీలు తీసుకొని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కి అదేవిధంగా అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాండ్రంగి చంటి, టౌన్ ప్రెసిడెంట్ మోపాడ చిన్ని, పెనుమత్స సురేష్ రాజు, గంధవరపు సతీష్, ఎలమంచిలి దేవుడు పాల్గొన్నారు.

గ్రంధాలయంలో ఆటల పోటీలు

విశాలాంధ్ర-చీడికాడ: మండల కేంద్రం లోని గ్రంధాలయంలోని గ్రంధాలయాధి కారిణి ఎంఎస్ఎల్ జోగేశ్వరి ఆధ్వర్యం లో గ్రంధాలయ వారోత్సవాలలో భాగం గా శనివారం 49 విద్యార్థులకు డ్రాయింగ్ వ్యాసరచన మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించరు ముగింపు రోజున గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆమె అన్నారు.

వడ్డాది లో ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: దేశం అభివృద్ధి చెందడంలో విలేకరుల పాత్ర ముఖ్యమైనదని అతిధి దేవోభవ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు అరిపాక కామేశ్వరరావు అన్నారు బుచ్చయ్యపేట మండలంవడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్థానిక అతిథిదేవోభవ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ పత్రిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ కే.వి.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదులుగా పాత్రికేయులు పని చేస్తున్నారన్నారు. స్వాతంత్రోద్యమంలో పత్రికల పాత్ర ఎంతో కీలకపాత్ర పోషించాయన్నారు. ప్రజలను చైతన్య పరిచాయన్నారు. సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అధ్యాపకులు ప్రభ,ముత్యాలమ్మ, నరసింహమూర్తి, సుధీర్, సునీత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలో 80 మంది విద్యార్థులు

విశాలాంధ్ర-మాకవరపాలెం: మాకవరపాలెం శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలను పురస్కరించుకొని గ్రంథాలయా ధికారిని వి.చంద్రకళ ఆధ్వర్యంలో మూడవరోజు శనివారం సుమారు ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ఎనభై మంది విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం వ్యవస్థాపకులు పి.రంగరాజు కార్యదర్శి శేషగిరిరావు ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మూర్తి కె.భాస్కరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-మునగపాక : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మునగపాక శాఖా గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ ఉద్యమ నేతలు పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు,పాతూరి నాగభూషణం,డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ సంస్మరణ కార్యక్రమం నిర్వహించి వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంధాల యాధికారి రమణ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో గ్రంథాలయాల ప్రాముఖ్యతను గుర్తించి ప్రజలను చైతన్యవంతులు చేయుటకు గ్రంథాలయ ఉద్యమం ప్రారంభించి అనేక గ్రంథాలయాలు స్థాపించి ప్రజలను చైతన్యవంతులుగా చేయటానికి కృషి చేశారని అన్నారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. గ్రంథాలయంలో వివిధ పుస్తక విభాగాలను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో పాఠకులు కరుణాకర్, బి.గణేష్ నాయుడు,దివ్యశ్రీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి : కర్ణాటక కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి



విశాలాంధ్ర-దత్తిరాజేరు: ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం ద్వారా పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ఎంతో ఉన్నతమైన మేధావి వర్గం ఉపాధ్యాయ బృందం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారని ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఇంతటి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నామని కర్ణాటక జిల్లా కలెక్టర్ మిత్తిరెడ్డి కూర్మా రావు అన్నారు. మండల కేంద్రం లోని దత్తిరాజేరు జిల్లా పరిషత్ హైస్కూల్ ను శనివారం సందర్శించారు. ఇదే మండలం లో ని పోరలి గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి కుర్మారావు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికై ప్రస్తుతం కర్ణాటక కలెక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విధాశాఖాకారి వై మాణిక్యాలరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో మందు షాపు తెరవాలంటూ మందుబాబుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-బుచ్చయ్యపేట: ఎర్రవాయి ప్రాంతానికి ముఖ ద్వారమైన రాజాం గ్రామం లో ప్రభుత్వం షాప్ నిర్వాహకులు వైన్ షాప్ పెట్టకపోవడంతో సుమారు 15 గ్రామాలు ప్రజలు నిత్యం వాణిజ్య కేంద్రమైన అనకా పల్లికి వివిధ రకాల పనులపైన ఎక్కువ మంది కార్మికులు ఈ ప్రాంతం నుండి వివిధ పనులకు వెళ్లి పగలంతా పని చేసి రాత్రికి ఇంటికి చేరుకొని రాత్రి పూట కాస్త చుక్క వేద్దాం అనుకుని సమీపంలో ఉన్న సీతయ్యపేట గ్రామానికి గాని కుంద్రం గ్రామానికి గాని రాత్రి పూట బెల్ట్ షాప్ కు వెళ్లి మందు కోసం వెళుతున్న సమయం లో ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని ప్రతి రోజు వెళ్లలేక మూడు బోటల్స్ తెచ్చుకుందామంటే పోలీస్ వారు కేసులు నమోదు చేస్తున్నారని అంతే కాకా ఇదే అదునుగా భావించి గ్రామంలో నాటు సారా,గొలుసు కట్టు బెల్టు షాప్ లు పుట్టగొడుగుల లాగా వీధికొక షాప్ తెరవడంతో అక్రమ బెల్ట్ షాప్ నిర్వాకులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా లాభం చేకూరుతుందని రాజాం పరిసర ప్రాంతాల్లో అక్రమంగా తెచ్చిన మద్యం ద్వారా ఈ పండగవేళ 10లక్షలు రూపాయలు వరుకు అమ్మకాలు చేసినట్లు ఊహగానాలు వినిపిస్తున్నాయి అంతే గాక ఒక బోటల్ మీద అదనంగా 50 నుంచి 70రూపాయలు వరకు అదనంగా వసూల్ చేస్తున్నారని మందు బాబులు ఆరోపణలు చేస్తున్నారు ఇకనైనా ప్రభుత్వం పెద్దలు సంబంధించిన అధికారులు స్పందించి గొలుసు కట్టు బెల్టు షాపులను అరికట్టి రాజాంలో బెల్ట్ షాప్ ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

మునగపాక రోడ్డు విస్తరణకై బాధితుల సమావేశం

విశాలాంధ్ర-మునగపాక: స్థానిక పిఎసిఎస్ ఆవరణలో శనివారం మునగపాక రోడ్డు విస్తరణలో భూమి, గృహాలు, ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితుల సమావేశం జరిగింది. గత వారం రోజుల క్రిందట స్థానిక పంచాయతీ కార్యాలయంలో రెవిన్యూ సిబ్బంది భూములు కోల్పోతున్న బాధితులతో సమావేశం ఏర్పాటు చేశారు. గతంలో ఇంటి స్థలం గజానికి 18504 రూపాయలు,పంట భూమి గజానికి 11 వేల చెప్పన ఒప్పందం రెవిన్యూ సిబ్బంది కుదుర్చుకున్నారు. నకాలంలో రైతులకు నష్టపరిహారం పంపిణీ చేయకపోవడం వలన సుమారు రెండేళ్ల కాలం గడిచిపోయింది. అప్పుడు మునగపాక లో ఇంటి స్థలానికి గజానికి 6000 రిజిస్ట్రేషన్ వేల్యూ ఉండగా అప్పటి వేల్యూ ప్రకారం 1o2 రీతిలో18,500 నష్టపరిహారం నిర్ణయించారు. నేడు రిజిస్ట్రేషన్ వేల్యూ పెరిగి 8 వేలయ్యింది. ఇప్పటి రిజిస్ట్రేషన్ వేల్యూ ప్రకారం సుమారు 24 వేల రూపాయలు అవ్వగా ఇదే రేటులో నష్టపరిహారం పంపిణీ చేయాలని అధికారులకు మేము తెలియజేయడం జరిగింది. అయితే అధికారులు గత రెండేళ్ల కిందట నిర్ణయించిన 18,500 ఇస్తామనడంతో దానికి మేము అంగీకరించలేదు. అయితే అధికారులు వేరొక సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పి, నేటికీ సమావేశం ఏర్పాటు చేయకుండా బాధితులను మోసగించే విధంగా. సిబ్బందిని పంపించి బాధితుల నుండి ఆధార్, బ్యాంకు ఖాతా నెంబరు వంటి ప్రూఫ్స్ వసూలు చేస్తూ ఈ రేటుకు అందరూ అంగీకరిస్తున్నారని నమ్మబలికిస్తున్నారు. ఈ విషయమై ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులంతా ఒకే మాట పైకి వచ్చి ప్రస్తుతం ఉన్న రిజిస్ట్రేషన్ వేల్యూ ప్రకారం నష్టపరిహారం పంపిణీ చేయాలని, రానున్న రోజుల్లో సుమారు 25 సంవత్సరాల పాటు ఈ విధమైన విస్తరణ చేపట్టకూడదని, ఇల్లు కోల్పోతున్న బాధితులకు తప్పనిసరిగా ఇంటి స్థలం ఇవ్వాల నే విధంగా సమావేశంలో చర్చించుకుని అందరూ ఏకాభిప్రాయంగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లేందుకు నిర్ణయించుకోవడం జరిగింది. కలెక్టర్ దీనికి అంగీకరించకుంటే న్యాయ పోరాటానికైనా సిద్ధపడాలని అందరం ఏకాభిప్రాయానికి వచ్చాం. విలేకరు సోదరులు తప్పనిసరిగా తమ పత్రికలలో ప్రచురించి బాధితులకు అండగా నిలవాలని కోరుతున్నాం

16కిలోల గంజాయితో యువకుడుపై కేసు నమెదు

విశాలాంధ్ర-గొలుగొండ: 16కిలోల గంజాయితో యువకుడుపై కేసునమెదు చేసినట్లు కేడీపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కృష్ణా జిల్లా మచిలిపట్నం గ్రామానికి చెందిన కాగిత జస్వంత్ స్కూటీ వస్తుండగా పాతకేడీపేట - బంగారంపేట రహదారి శివారు లో వాహనాలు తనిఖీల్లో అతని వద్ద గోని సంచిలో గంజాయి ఉన్నట్లు గుర్తించారని ఎస్ఐ తెపారు. దీంతో అతనిపై కేసు నమోదు చేసి స్కూటీ,సెల్ ఫోన్ స్వాధీనపర్చుకున్నట్లు చెప్పారు.

కేడీ పేటలో నవోదయం అవగాహనా సదస్సు

నాటుసారా అమ్మకాల నియంత్రనే లక్ష్యం

విశాలాంధ్ర-గొలుగొండ: గొలుగొండ మండలం కేడీపేట గ్రామంలో శనివారం గొలుగొండ ప్రోహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీ బి మధుకుమార్ అక్రమంగా నాటుసారా అమ్మకాలను నిరోదించే ఉద్దేశ్యం గ్రామం లోని ప్రజలకు చైతన్య పరిచే విధంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నాటుసారా ల వలన గ్రామానికి జరుగు అనర్ధాల గురించి వివరించడం జరిగింది. నాటుసారా అమ్ముట, రవాణా చేస్తు పట్టుబడిన వారికి చట్ట ప్రకారం ఉన్న శిక్షలు గురించి వాటి తీవ్రత వివరించడం జరిగింది. గ్రామంలో ఎవరైనా నాటుసారా అమ్మితే ఎక్సైజ్ డిపార్టెంట్ కి సమాచారం ఇవ్వవలసిందిగా కోరడమైనది. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గొప్యంగా ఉంచబడతాయని సీఐ తెలిపారు.

గరివిడి మండల పరిషత్తు లో జి.పి.డి.పి ట్రైనింగ్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-గరివిడి: మండల పరిషత్తులో శని వారం 10:00 నుంచి 5:00 గంటల వరకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎంవిబి. సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జి.పి.డి.పి ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ట్రైనింగ్ నిమిత్తం మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు వివో ప్రెసిడెంట్లు హాజరైనారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఈవో ఆర్ వెంకట్రామన్ మరియు కోర్స్ డైరెక్టర్ కె నాగరాజు విచ్చేసినారు. ఈ 2025-26 ఆర్థిక సంవత్సరం గాను గ్రామపంచాయతీ అభివృద్ధి కై ప్రణాళికను వివిధ శాఖల సమన్వయంతో రూపొందించి గ్రామసభల ద్వారా ఆమోదం పొందాల్సి ఉంటుందని అని శిక్షణ ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో 10 శాఖలకు చెందిన అధికారులు పాల్గొనడం జరిగింది.

యుద్ధ ప్రాతిపదికన కాలువల్లో పూడికతీత పనులు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : విజయనగర పరిధి లో వివిధ ప్రాంతాలలో కాలువ పూడికతీత పనులను ప్రజారోగ్య సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన తొలగించి వేస్తున్నారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి సూచనలతో సిబ్బంది పూడికతీత పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రధాన కాలువల్లో పూడికతీతలను జెసిబి ల సహాయంతో తొలగిస్తే, చిన్నచిన్న సందులలో బాబ్ కార్టుల ద్వారా పూడికలను తీస్తున్నారు. బాబ్ కార్టులు కూడా వెళ్లలేని ప్రాంతాలలో పారిశుధ్య పనివారలతో పూడికలను తొలగించి వేస్తున్నారు. కాలువల్లో పూడికలు పేరుకుపోవడంతో నీరు నిల్వ ఉండి దోమల వృద్ధి అధికంగా అవుతుందన్న కారణంగా ఎప్పటికప్పుడు కాలువలను పరిశు భ్రపరచాలని కమిషనర్ ఆదేశించి ఉన్నారు. దీంతో సిబ్బంది అప్రమత్తమై ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికతీతలు తీసేందుకు కృషి చేస్తున్నారు.

శోభాయమానంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి



విశాలాంధ్ర-డెంకాడ: ఘనంగా శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక శనివారం ఎంతో శోభాయమానంగా శనివారం భక్తులతో కిటకిటలాడుతున్న ఉభయగ్రామల వెంకన్న దేవాలయం అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు ఆదిమధ్యాంత రహితుడు కలియుగ ప్రత్యక్షదైవం దేదీప్యమానంగా విరాజిల్లుతున్న డెంకాడ గుణుపురూ ఉభయ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్తిక శనివారన్ని పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో దర్శనానికి వచ్చారనీ భక్తులందరికి అష్టోత్తర నిరాజన మంత్రపుష్పం పూజలు చేశారని ఆలయ అర్చకులు శ్రీమాన్ జగన్నాధాచార్యులు తెలిపారు.

పరిశ్రమల పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు

పాఠశాలల్లో సుర్యఘర్ యోజనకింద సోలార్ ప్రాజెక్ట్ లు

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో ఎం.ఎస్.ఎం.ఈ, ఇతర పరిశ్రమల పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీని నియమించినట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. 9 మంది సభ్యుల తో ఏర్పాటు చేసిన ఈ కమిటీ కి డిప్యూటీ కలెక్టర్ జోసెఫ్ ను ఇంచార్జ్ గా నియమించినట్లు తెలిపారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో పరిశ్రమల శాఖ పై సమీక్షిం చారు. ఈ సందర్భంగా పరుశ్రమల ప్రోత్సాహానికి అవసరమగు భూ సమస్యలను రెవిన్యూ అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. సూర్య ఘర్ యోజన క్రింద పాఠశాలల్లో , కళాశాలల్లో రూఫ్ పైన సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. సూర్య ఘర్ దరఖాస్తులకు నేడ్కాప్ వారు త్వరగా ఆమోదం ఇవ్వాలని అన్నారు. సోలార్ ప్రాజెక్ట్ ల ఏర్పాటుకు బహిరంగ ప్రదేశాల్లో 10 ఎకరాల వరకు స్థలం ఉండే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. ఈ సమావేశం లో సి.పి.ఓ బాలాజీ, పరిశ్రమ శాఖ అధికారులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర-అచ్యుతాపురం: అచ్యుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు విస్తరణ బాధితుల సమస్యలు పరిష్కరించాలని అనకాపల్లి ఆర్డీవోకి శనివారం ప్రజా సంఘా లు వినతిపత్రం అందజేశారు. అచ్యుతాపురం నుండి మునగపాక మీదుగా అనకాపల్లి బైపాస్ వరకు 100 అడుగుల రోడ్డు విస్తరణకు ప్రభుత్వం సేకరిస్తున్న భూములు రోడ్డుకి ఇరువైపులా ఇళ్ళు, షాపులు ,భూములు కోల్పోతున్న నిర్వాసితులు సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ప్రధానంగా ఇప్పటికే భూములు కోల్పోతున్న వారి పేర్లు లిస్టులో ఉన్న తప్పులు సరిచేసి ఫైనల్ లిస్ట్ ప్రకటించాలన్నారు . రోడ్డుకు ఇరువైపులా జిరాయితి భూములలో ఇల్లు, షాపులు కోల్పోతున్న అనేక మందికి పేర్లు ఇప్పటికీ నమోదు చేయలేదన్నారు . ఆర్ అండ్ బి వారు ఫైనల్ చేసిన లిస్టు ఇప్పటికీ ప్రకటించలేదని , దీంతో నిర్వాసితులు అందరూ ఆందోళనకు గురవుతున్నారన్నారు . ఈ లిస్టును వెంటనే బహిరంగపరిచి తప్పులు లేకుండా ఫైనల్ లిస్ట్ పెట్టాలన్నారు . రోడ్డుకు ఇరువైపులా ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్న వారికి పరిహారం ఇ వ్వాలని, భూములు, ఇల్లు ,షాపులు కోల్పోతున్న వారికి అందరికీ ఒకేసారి పేమెంటు జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు . ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. రామ సదాశివరావు , రైతు సంఘం జిల్లా కార్యదర్శి కర్రీ అప్పారావు , సిఐటియు మునగపాక కార్యదర్శి కే బ్రహ్మాజీ , ఎస్సీ జడ్ నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు బుద్ధ. రంగారావు, ఎన్. కనుమనాయుడు, రోడ్డు విస్తరణ సంక్షేమ సంఘం కార్యదర్శి ఆర్ రాము వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు .

డాక్టర్ రాజేష్ పరామర్శ

విశాలాంధ్ర-రాజాం : రాజాం మండలం లక్ష్మీపురం గ్రామం, నందబలగ పంచాయతీకి చెందిన లక్ష్మీపురం గ్రామ వైస్సార్సీపీ సీనియర్ నాయకులు గేదేల.సత్యం కి ఇటీవల శాస్త్ర చికిత్స జరిగిందని తెలుసుకొని ఇంటికి వెళ్లి పరామర్శించిన రాజాం నియోజకవర్గం వైఎస్ఆర్సీపీ ఇంచార్జి డా.తలే రాజేష్, వారితో పాటు రాజాం రూరల్ పార్టీ అధ్యక్షులు లావేటి. రాజగోపాల్ నాయుడు,జడ్పిటిసి బండి.నరసింహులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు వాకముల్ల. చిన్నంనాయుడు, డా.బి.నరేంద్ర,, సర్పంచ్ కొర్ను ఈశ్వర్ రావు, మాజీ సర్పంచ్ బింగి సూర్య నారాయణ, తాడ్డి.గోపాల కృష్ణ, సూరిబాబు, గొలివి.రామకృష్ణ, బింగి.రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పత్రిక దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర-బొబ్బిలి: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా, పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజంగా ప్రసిద్ధి పొందిన, జర్నలిస్ట్ పితామహుడు, సర్ చిర్రావూరు యగ్నేశ్వర చింతామణి విగ్రహానికి డీఎస్పీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి,సిఐ సతీష్ కుమార్‌లు చేతులమీదుగా పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సివై చింతామణి విజయనగరం వాసి కావడం మనకు గర్వకారణం. 18 సంవత్సరాల వయసులో పత్రిక రంగంలో ప్రవేశించి, ఐదు దశాబ్దాల పాటు పత్రికా రంగంలో మంచి ప్రావీణ్యత సాధించారని అన్నారు. 62వ యేట అకాల మృతి చెందారు. ఎంతోమంది పాత్రికేయు లకు ఆదర్శప్రాయంగా ఉంటూ,నీతి నిజాయితీని నమ్ముకుని,పత్రికా రంగం ద్వారా ప్రజలకు సేవలు అందించడం అనేది ఒక గొప్ప అవకాశం అని సర్ సి వై చింతామణి అప్పట్లో తెలియజేశారని అన్నారు.

జెఎన్‌టియుజివి లో ప్లానిటేషన్ కార్యక్రమం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంగురజాడ విశ్వవిద్యాలయాన్నీ గ్రీన్ క్యాంపస్ గా మార్చడానికి గ్రీన్ క్లబ్ ప్రారంభించారు. దీని ప్రారంభోత్సవంలో భాగంగా ప్లానిటేషన్ కార్యక్రమాన్ని యూనివర్సిటీ లోఇంచార్జ్ ఉప- కులపతి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయసుమ ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ రిజిస్టర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని గ్రీన్ క్యాంపస్ గా మార్చడానికి కంకణం కట్టుకొని ముందుకు రావాలని పిలుపునిచ్చారు అధ్యాపకులతో పాటు విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కళాశాల ఆవరణలో ఒక్కో విభాగం పచ్చదనం, పరిశుభ్రత మరియు పర్యావరణ పరిరక్షణ దిశగా అడుగులు వేయాలని, మన విశ్వవిద్యాలయం ఆదర్శంగా నిలవాలని కోరారు. గ్రీన్ క్లబ్ ద్వారా విధ్యార్దులకు గ్రీన్ కమాండోస్ గా శిక్షణ, పర్యావరణ పట్ల అవగాహన, కాలుష్య నియంత్రణ, మొక్కల పెంపకం, సేంద్రియ వ్యవసాయం వంటి అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ సాంకేతిక కళాశాల ఇంచార్జి ప్రధానాచార్యులు డా. ఆర్. రాజేశ్వరరావు, ప్రొఫెసర్. కె.బాబులు, మూల్యాంకన మరియు అడ్మిషన్ల డైరెక్టర్, డాక్టర్. ఆర్. గురునాథ, పరీక్షల నియంత్రణాధికారి, డా. జి. జే. నాగరాజు, వైస్-ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్, బోధన, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమములో పి. వి. పద్మనాభం, వ్యవస్థాపకుడు , స్పార్క్ సొసైటీ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మహాసభల సందర్భంగా పురవీధుల్లో సిపిఎం ర్యాలీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సిపిఎం పార్టీ 10వ జిల్లా మహాసభలు సందర్భంగా పట్టణంలో పురవీధుల్లో సిపిఎం ర్యాలీ నిర్వహించింది. ఎన్సిఎస్ జంక్షన్ నుండి కన్యకా పరమేశ్వరి కోవెల మీదగా గంట స్తంభం మూడు లాంతర్లు మీదగా బొంకుల దిబ్బ వరకు పది జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కోట జంక్షన్ వద్ద బహిరంగ సభకు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ శంకర్ రావు జిల్లా ప్రగతికి, అభివృద్ధికి బాటలు వేసిన గురజాడ, గిడుగు, శ్రీకాకుళం రైతన్న పోరాటం స్ఫూర్తి ఈ జిల్లాలో కొనసాగుతుందన్నారు. వేదిక మీదకు నాయకులను స్వాగతం పలికారు.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైనసిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి, రాష్ట్రం లో టిడిపి , జనసేన వచ్చేయన్నారు. మోడీ సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారని ప్రస్తుతం ఎంతమంది ఉద్యోగాలు ఇచ్చారో తెలపాలన్నారు. ఇప్పుడు మరల ఉద్యోగాలు ఇవ్వకుండా అప్రంటిస్ చేయిస్తాం అని చెప్పి కంపెనీలకు లక్ష కోట్లు కేటాయిస్తున్నారన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కే. లోకనాదం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ అమ్ముతుంటే ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డుపడడం లేదని. ప్రభుత్వ స్టీల్ ప్లాంట్ కి కూత దూరం లో మిట్టల్ ప్రయివేటు కంపెనీకి పర్మిషన్ ఎందుకు ఇచ్చారన్నారు. స్టీల్ ప్లాంట్ మూసివేసి ఆ భూములు మిట్టల్ కు దోచిపెట్టడానికి తప్ప మరొకటి కాదన్నారు.మోడీ ఏంటో ఒకటే భాష, ఒకటే పన్ను, ఒకటే మన్ను, ఒకటే డ్రెస్సు అంటూ.. ఈరోజు ఒకటే ఎన్నికలు అంటున్నారన్నారు. ఒకే ఎన్నిక అయితే స్థానిక సమస్యలన్నీ పక్కకి పోతాయి అన్నారు. విద్యుత్ చార్జీలు జగన్ ప్రభుత్వం పెంచారని బాబు గోల చేశారని. మరి బాబు ఎందుకు తగ్గించడం లేదన్నారు .సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. సూర్యారావు మాట్లాడుతూ మన జిల్లా కూడా ముందుంది.గత పదేళ్ళలో లక్షా డబ్బాయి వేలు మాత్రమే ఇచ్చారని, అందులో లక్షా పది వేలు సచివాలయం, 35 కాంట్రాక్టు ఉద్యోగాలు అంటే అవి కాకుండ ఇచ్చినవి కేవలం 25వేల ఉద్యోగాలు మాత్రమేనని. రాష్ట్రం లో 2 లక్షల 35 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు.సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మీ మాట్లాడుతూ గత మూడేళ్ళ కాలం లో అనేక పోరాటాలు చేసి విజయాలు సాధించామని. 50 వేల వరకూ శ్రామిక మహిళలు పని చేస్తున్నారు. ఈరోజు హెూటల్స్ లోనూ షాప్ ల్లోనూ ఎక్కువగా మహిళలే పని చేస్తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి సభ్యులు టీవీ రమణ మాట్లాడుతూ మన జిల్లాలో గంజాయి కి యువత ఎక్కువగా బానిసలు అవుతున్నారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించిన పురపాలక సంఘ ప్రాంతీయ సంచాలకులు రవీందర్

విశాలాంధ్ర -బొబ్బిలి : పురపాలక సంఘ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ మరియు శానిటేషన్ విభాగాల శాఖాధిపతులతో విశాఖపట్నం ప్రాంతీయ పురపాలక సంచాలకులు వి. రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పారిశుధ్య విభాగంలో ఎంతమంది కార్మికులు పనిచేస్తున్నది, కార్మికులను ఏ విధంగా వినియోగిస్తున్నది, ఇంటింటి చెత్త సేకరణ మరియు శాగ్రిగేషన్ కోసం ఏ విధమైన ప్రణాళికలు పాటిస్తున్నది మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి అడిగి తెలుసుకున్నారు . ప్రైమరీ ట్రాన్స్ఫర్ట్ మరియు సెకండరీ ట్రాన్స్ఫర్టేషన్ జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు, సోలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ మరియు లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ ప్రాప్తికి పారిశుధ్యం మరింత వృద్ధి సాధించడానికి సూచనలు జారీ చేశారు. ఇంటి పన్నులు, కులాయి పన్నులు, ఖాళీ స్థలములు పన్నులు, షాపు రూముల అద్దె వసూళ్ళు, రోడ్డు మార్జిన్ మరియు మార్కెట్ కిస్తీ మొదలగు వివరాలను తెలుసుకొని మరింత పురోగతి సాదించాలని తెలియజేశారు. ఇంజనీరింగ్: విభాగంలో అభివృద్ధి పనులకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు, నిర్దేశించిన కాలానికి పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు, పాట్ హెూల్స్ గుర్తించి వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్: అర్బన్ రిసర్వే కు సంబంధించి నిర్దేశించిన కాలానికి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎల్. రామలక్ష్మి తో పాటు మున్సిపల్ ఏఈ గుప్తా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై ఆకస్మిక దాడులు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది కొరడా ఝుళిపించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాల మేరకు 8వ సర్కిల్ నందు 27 30వ సచివాలయాల పరిధిలో ఉన్న హెూల్సేల్ దుకాణా లందు ఆకస్మిక దాడులు చేపట్టారు. ప్లాస్టిక్ విక్రయ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు అపరాధ రుసుములను విధించారు. సుమారు 560 కేజీల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీన పరుచుకున్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో ప్రజారోగ్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి మూకుమ్మడి దాడులు చేపట్టారు. దీంతో ప్లాస్టిక్ సంచులు, ముచ్చులు, గ్లాసులు వంటి ఇతర నిషేధిత వస్తువులను స్వాధీనపరుచుకున్నారు. మరలా పునరావృతం చేస్తూ విక్రయాలు సాగించినట్లయితే దుకాణాలను సీజ్ చేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. ప్లాస్టిక్ నిషేధం లో కృషి చేస్తున్న ప్రజారోగ్య సిబ్బందిని అభినందించారు. స్వాధీనపరు చుకున్న ప్లాస్టిక్ వస్తువులను ప్రదర్శించిన సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఇకనుండి నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయాలు కానీ వినియోగం గానీ చేపట్టరాదన్నారు. పలుమార్లు హెచ్చరిస్తున్నా దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మరలా ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నారని తాము గుర్తించామన్నారు. ఇదే ఆఖరి హెచ్చరికగా భావించి పూర్తిగా ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను నిలుపుదల చేసుకోవాలని స్పష్టం చేశారు. లేకుంటే భారీగా అపరాధ రుసుము వసూలు చేయడమే కాకుండా దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పర్యవేక్షకులు బాలకృష్ణ, రవి శేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.